క్లుప్తంగా

సీఎంను కలిసిన అజ్మతుల్లా హుస్సేనీ



గంభీరావుపేట(సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువనేత, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టనున్న సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు.

సన్మానం

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన అజ్మతుల్లా హుస్సేన్‌ను జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కే సాహెబ్ సన్మానించారు. హైదరాబాద్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. మైనార్టీ నాయకులు మహమ్మద్ తాజొద్దీన్, మహమ్మద్ రఫీ, సయ్యద్ జహంగీర్, మహ్మద్ గౌస్, తదితరులున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు రండి



మంత్రి పొన్నంను ఆహ్వానిస్తున్న నారాయణపూర్ గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌లో ఈనెల 22న నిర్వహించే హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరు కావాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. హైదరాబాద్‌లో మంగళవారం కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారిని వేడుకకు రావాలని కోరుతూ ఆహ్వానపత్రం అందించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. మాజీ సర్పంచ్ నర్సయ్య, రామాలయ కమిటీ చైర్మన్ సూర నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ మహేందర్, నిమ్మ లక్ష్మీనారాయణరెడ్డి, లింగాల నర్సయ్య తదితరులున్నారు.

మేడిగడ్డ పర్యటనకు 'ఆది'



ఎమ్మెల్యేలతో కలిసి బస్సులో వెళ్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించేందుకు మంగళవారం అసెంబ్లీ నుంచి బయలుదేరిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటలకు మేడిగడ్డ చేరుకున్న ఈ బృందం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ పరిశీలించిన తర్వాత సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

తెగిన విద్యుత్ తీగలు.. తప్పిన ప్రమాదం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేటలో మంగళవారం హఠాత్తుగా విద్యుత్‌తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. ఈ విషయాన్ని మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్ సెస్ లైన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీరాజంకు తెలిపారు. స్పందించిన లక్ష్మీరాజం, మిగతా సిబ్బందితో కలిసి విద్యుత్ తీగలు సరిచేయడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

కారు దిగనున్న బీఆర్‌ఎస్ నాయకులు



బండారి బాల్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కారు దిగి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. పదేళ్ల అధికారంలో ఉండి కూడా తమకు ప్రాధాన్యత ఇవ్వలేదని కినుక వహించిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి మృత్యుంజయంలను ఇప్పటికే కలిసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా బీఆర్‌ఎస్ ఎల్లారెడ్డిపేట పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి కొన్ని రోజులుగా పార్టీ కార్యక్రమాలకు అంటీముట్టనట్టుగా ఉంటున్నారు. పార్టీ బలోపేతానికి ఎంత కష్టపడినా తనకు తగిన గుర్తింపు దక్కలేదని, పార్టీ మారే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ పెద్దలతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం.

మొక్కల పెంపకానికి రెడీ



గంభీరావుపేట నర్సరీలో మొక్కలకు నీరు పడుతున్న సిబ్బంది

- నర్సరీల్లో పెంచుతున్న పూలు, పండ్ల మొక్కలు
- మండలంలో 63 వేల మొక్కలు నాటడమే అధికారుల లక్ష్యం

గంభీరావుపేట: పదో విడత హరితహారంలో భాగంగా మండలంలో మొక్కలు పెంచేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. మండలంలో 21 గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 18 నర్సరీల్లో మొక్కలు పెంచడం ప్రారంభించారు. ఈ ఏడాది మండలవ్యాప్తంగా నర్సరీకి మూడు వేల మొక్కల చొప్పున 63వేల మొక్కలు పెంచి నాటేలా అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వర్షాలు కురిసిన తర్వాత అప్పటికీ పెరిగిన మొక్కలను రహదారులకు ఇరువైపులా, పంటపొలాలు, ఖాళీ స్థలాల్లో నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం నర్సరీల్లో విత్తన మొక్కలు నాటడం, ఖాళీ సంచుల్లో మట్టి నింపడం, మొక్కలకు నీరు పట్టడం లాంటి పనుల్లో కూలీలు నిమగ్నమయ్యారు.

మొక్కలు ఎండిపోకుండా గ్రీన్‌షెడ్స్..

వన నర్సరీల్లో వివిధ రకాల పూలు, పండ్లు, ఔషధ మొక్కలు పెంచుతున్నారు. తంగేడు, దానిమ్మ, చామంతి, గులాబీ, మందారం, కానుగ, వేప, కరివేపాకు, గన్నేరు వంటి మొక్కలు నాటేందుకు అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. నర్సరీల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదే కావడంతో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో వన సేవకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు చకచకా పనులు చేయిస్తున్నారు. ఎండలు మొదలయ్యాయి. వేసవిలో నర్సరీ ల్లోని మొక్కలు ఎండిపోకుండా ఏటా గ్రీన్‌షెడ్స్ ఏర్పాటు చేస్తారు. ఈసారి నీడ సౌకర్యం కల్పించడం లేదు.

నిత్యం పర్యవేక్షిస్తున్నాం



హరితహారంలో మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేసిన వన నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలు పెంచుతున్నాం. ముస్తఫానగర్, రాజేశ్వర్‌రావునగర్ గ్రామాలు మినహాయిస్తే అన్ని గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నాం. నిత్యం నర్సరీ పనులను పర్యవేక్షిస్తున్నం. వర్షాలు కురవగానే మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటాం.

– అరుణ, ఈజీఎస్ ఏపీవో, గంభీరావుపేట

మొక్కలను సంరక్షించాలి



మొక్కలు నాటి సంరక్షణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలి. అప్పుడే హరితహారం లక్ష్యం నెరవేరుతుంది. సరైన నిర్వహణ లేకపోవడంతో అక్కడక్కడ మొక్కలు చనిపోతున్నాయి. అలా జరుగకుండా చర్యలు తీసుకోవాలి. నాటిన ప్రతిమొక్క పెరగాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలి.

– వంగ కరుణ, ఎంపీపీ, గంభీరావుపేట

బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం



మాట్లాడుతున్న హరీశ్ గౌడ్

రుద్రంగి: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గద్దం హరీశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఎన్నికల్లో హామీల వర్షం కురిపించి అన్ని వర్గాల ఓట్ల మద్దతుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మొండి చేయి చూపిస్తుందని విమర్శించారు. సబ్బండ వర్గాలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజల పట్ల గత పాలకులు చేసిన నిర్లక్ష్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వారసత్వంగా కొనసాగిస్తుందని ఆరోపించారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు గంగాధర్, సతీశ్, రమేశ్, అజయ్ తదితరులు ఉన్నారు.

ఎన్నికలు వచ్చినప్పుడే పల్లెలు గుర్తొస్తాయా?

కోనరావుపేట: ఎన్నికలు వచ్చినప్పుడే ఎంపీ బండి సంజయ్‌కి గ్రామాలు గుర్తొచ్చాయని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ఉప్పుల గంగయ్య ప్రశ్నించారు. సుద్దాలలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఐదేళ్లక్రితం ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన ఎంపీ సంజయ్ మళ్లీ ఎన్నికల సమయంలోనే ప్రచారానికి వచ్చారన్నారు. వేములవాడ రాజరాజేశ్వర ఆలయానికి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. మండల అభివృద్ధికి ఎన్ని నిధులు కేటాయించారో ప్రజలకు తెలపాలన్నారు. నాయకులు రమేశ్, మహేశ్, నీరటి సంజీవ్, సురేశ్, దేవయ్య, విజయ్ తదితరులున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుభ్రం చేస్తున్న ఎంపీపీ మానస, ఆశాలు

తంగళ్లపల్లి: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం ఎంపీపీ పడిగెల మానస ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను శుభ్రం చేశారు. ఎంపీపీ మానస మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తహసీల్దార్ తంగళ్లపల్లి స్పెషల్ అధికారి వెంకటలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నేడు ప్రజాహిత యాత్ర

ముస్తాబాద్: ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత యాత్ర బుధవారం మండలంలో కొనసాగుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్ తెలిపారు. చిప్పలపల్లి, నామాపూర్, ముస్తాబాద్, పోతుగల్, గన్నెవారిపల్లె, సేవాలాల్‌తండాల్లో ప్రజాహిత యాత్రలో బండి సంజయ్ పాల్గొంటారని, అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన ట్రాక్టర్

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని హన్మాజీపేట గ్రామ శివారులో ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన గణేశ్, అజయ్‌కు గాయాలు కాగా వారిని వెంటనే వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.


విద్యుత్ కంచె అమర్చిన వ్యక్తి అరెస్ట్

రుద్రంగి(వేములవాడ): పంట పొలాల చుట్టూ, అడవి జంతువుల వేట కోసం అక్రమంగా విద్యుత్ కంచెలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అశోక్ హెచ్చరించారు. మండలంలోని రూప్లానాయక్ తండా గ్రామంలో ఈ నెల 9న పంట చేనుకు విద్యుత్ కంచె అమర్చి పాడి గేదె మృతికి కారణమైన గుగులోతు తిరుపతిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. బాధితుడు గుగులోతు హరిసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తిరుపతిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.


భూమిపూజ

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని వ్యవసాయ క్లస్టర్ సమీపంలో మంగళవారం జెడ్పీటీసీ నిధులతో జెడ్పీటీసీ పూర్మాని మంజుల రాంలింగా రెడ్డి ఆధ్వర్యంలో బోరు మోటార్‌కు భూమిపూజ చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దొంతుల ఆంజనేయులుకు ప్రొసీడింగ్ అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రంగు శ్యామ్, సీనియర్ పాత్రికేయులు పిల్లి శ్రీనివాస్, అందె దేవేందర్, పాత్రికేయులు ప్రణయ్, రాజు, రాజశేఖర్, శ్రీనాథ్ రావు, మధు, సాగర్, కాంగ్రెస్ నాయకులు పూర్మాని రాంలింగా రెడ్డి, నర్సింగం గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మోర రాజు, మిరాల శ్రీనివాస్ యాదవ్, మునిగెల రాజు, చుక్క రాజశేఖర్, పర్శరాములు, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కృష్ణాజలాల్లో హక్కుల కోసం పోరాటం



గంభీరావుపేట: సభకు తరలివెళ్తున్న నాయకులు



సిరిసిల్లటౌన్: జిల్లాకేంద్రం నుంచి తరలుతున్న నేతలు



వేములవాడఅర్బన్: సభకు తరలుతున్న నాయకులు

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): కృష్ణానదీ జలాల్లో తెలంగాణ హక్కుల కోసం బీఆర్‌ఎస్ పోరు సాగిస్తుందని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. మండలం నుంచి నల్లగొండ బహిరంగ సభకు రవీందర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ.. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ హక్కులను కేంద్రానికి ధారదత్తం చేసే కాంగ్రెస్ వైఖరిని బీఆర్‌ఎస్ వ్యతిరేకిస్తుందన్నారు. వెంకటియాదవ్, రాజనర్సు, భిక్షపతి, లతారెడ్డి, శ్రీమతి, శ్రీకాంత్‌రెడ్డి, అభిలాష్, వెంకటస్వామి గౌడ్, వహీద్, అహ్మద్, రాజు, నాగరాజు గౌడ్, ఆనందం, రవి తదితరులున్నారు.

సిరిసిల్లటౌన్: నల్గొండలో జరిగిన బీఆర్‌ఎస్ సభకు జిల్లాకేంద్రం నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కుంభాల మల్లారెడ్డి, బొల్లి రామ్మోహన్ తదితరులున్నారు.

కోనరావుపేట: మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు నల్గొండ సభకు తరలివెళ్లారు. ఎంపీపీ చంద్రయ్య, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, నాయకులు మాదాసు భూమయ్య, నిషాని రవీందర్, అంజయ్య, మల్లారెడ్డి మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు తరలివెళ్లారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలం నుంచి భారీసంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులు నల్గొండ సభకు తరలివెళ్లారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ రేణుక కిషన్, ఎంపీటీసీ పందిర్ల నాగరాణి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ఎడ్ల లక్ష్మణ్ తదితరులన్నారు.

వేములవాడఅర్బన్: నల్గొండలో బీఆర్‌ఎస్ తలపెట్టిన బహిరంగ సభకు వేములవాడ అర్బన్ మండల బీఆర్‌ఎస్ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్, పోతుగల్, గూడెం, కొండాపూర్, గూడూరు, నామాపూర్, చిప్పలపల్లి, మద్దికుంట, మోహినికుంట గ్రామాలనుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎంపీపీ శరత్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, విజయరామారావు, సర్వర్, కొమ్ము బాలయ్య, సంతోష్‌రావు, మల్లేశ్, భరత్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

వీర్నపల్లి: మండలంలోని అన్నిగ్రామాల నుంచి వందమంది బీఆర్‌ఎస్ సభకు తరలివెళ్లారు. సెస్ డైరెక్టర్ మల్లేశం, నాయకులు రవి, బుగ్గయ్య, ప్రభాకర్, నాగరాజు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలకేంద్రం నుంచి మంగళవారం నల్గొండ బహిరంగ సభకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు గజబీంకార్ రాజన్న, పెద్దూరి తిరుపతి, కోడి అంతయ్య, అంకారపు రవీందర్, ఎండీ.హమీద్ తదితరులున్నారు.

వేధింపులకు గురిచేస్తే ఫిర్యాదు చేయాలి



మాట్లాడుతున్న షీటీం ఏఎస్సై ప్రమీల

వేములవాడఅర్బన్: విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామని షీటీం ఏఎస్సై ప్రమీల అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం శ్రీ రాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులకు షీటీమ్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైనా ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే విద్యార్థినులు నిర్భయంగా పోలీసులకు తెలపాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ మాట్లాడుతూ మహిళలు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీదేవి, రవి కుమార్, రమాదేవి, శ్రీధర్, తదితరులు ఉన్నారు.

'గృహజ్యోతి'కి దరఖాస్తు చేసుకోవాలి

ముస్తాబాద్: 200 యూనిట్ల విద్యుత్ రాయితీకోసం గృహజ్యోతి పథకానికి అర్హులైన విద్యుత్ వినియోగదారులు దరఖాస్తులు చేసుకోవాలని సెస్ ఏఈ విష్ణుతేజ కోరారు. గూడెం, ముస్తాబాద్, పోతుగల్, బందనకల్ గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ప్రజాపాలన రసీదు, విద్యుత్ బిల్లు జిరాక్స్ కాపీలతో ఆయాగ్రామ పంచాయతీల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల15తో దరఖాస్తుల గడువు ముగుస్తుందన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బోయినపల్లి(చొప్పదండి): కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దేశాయిపల్లిలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కార్మికులకు పనికి తగ్గ వేతనం అందించాలన్నారు. కార్యక్రమంలో హమాలీ కార్మిక సంఘం నాయకులు కుర్మ రవి, కుర్మ రాజేశ్, కుర్మ సంజీవ్, కుడుకల గిరిబాబు, బూర్గు పర్శరాములు, బూర్గు రమేశ్, చంద్రకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యవసాయ కూలీ మృతి



రాజనర్సు(ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వరదవెల్లికి చెందిన జిందం రాజనర్సు (60) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న వరదవెల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ జిందం రాజనర్సు చేనులో పని ముగించుకొని నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈక్రమంలో వరదవెల్లి రోడ్డు పక్కన ఆగి మరో ఇద్దరితో మాట్లాడుతుండగా, అదే సమయంలో పెగడపల్లి మండలం బతికెపల్లికి చెందిన మారుతి కారు అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజనర్సుతో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. ముగ్గురిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన బాధితుల ఫిర్యాదు మేరకు అప్పుడే కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా ఇందులో తీవ్రంగా గాయపడిన రాజనర్సును మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమారుడు నాగార్జున, కూతురు ఉన్నారు.

ఆవునూర్ జెడ్పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ నిర్వహించిన డ్రామా పోటీల్లో ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది. అడవిలో సందర్శకులు నీటిని, నేలను కలుషితం చేస్తూ, జంతువులకు ఇబ్బందులు పెట్టే కథ అంశంతో విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. అటవీశాఖ అధికారులు టూరిస్టులకు కనువిప్పు కలిగిస్తూ ప్రదర్శించిన నాటకం అందరినీ ఆలోచింపచేసింది. దీనికి ప్రథమ బహుమతిని నిర్వాహకులు ప్రకటించి, విద్యార్థులను అభినందించారు. గైడ్ టీచర్ ఆడెపు గణేశ్‌ను డీఈవో రమేశ్, ఈఎల్‌టీఏ ప్రతినిధులు తిరుపతి, రాజు అభినందించారు.

గోదాం నిర్మాణానికి భూమిపూజ

కోనరావుపేట: మండలంలోని నాగారంలో ఎరువుల గోదాం నిర్మాణానికి ఎంపీ బండి సంజయ్ మంగళవారం భూమిపూజ చేశారు. గోదాం కోసం ఎంపీ తన నిధులతో రూ.5 లక్షలు మంజూరు చేశారు. రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగరాజు, సింగిల్‌విండో డైరెక్టర్ జ్యోతి, సంఘం డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారులకు చుక్కల మందు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ఆరోగ్య ఉపకేంద్ర పరిధి అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు విటమిన్ ఏ చుక్కలు మందువేశారు. కంటిలో తెల్లమచ్చల నివారణ, కంటిచూపు మందగించకుండా ఉపయోగపడతాయని వైద్యసిబ్బంది తెలిపారు. ఈనెల 19వరకు కార్యక్రమం కొనసాగనుంది.

పోస్టర్ల ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: ఈనెల 16న ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్లను సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ ఆవిష్కరించారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో కార్మికులతో కలిసి మాట్లాడారు.

నియామకం

తంగళ్లపల్లి: బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడిగా ఇందిరమ్మకాలనీ గ్రామానికి చెందిన చిందం అనిల్‌ను నియమిస్తున్నట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో అనిల్‌కు నియామకపత్రం అందజేశారు.

నాటుబాంబు పేలి గేదెకు తీవ్రగాయాలు

కోనరావుపేట(వేములవాడ): నాటుబాంబు పేలి గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం మండలంలోని మరిమడ్లలో కోల శ్రీనివాస్‌కు చెందిన గేదె గ్రామ శివారులోని అహ్మద్‌హుస్సేన్‌పల్లిలో మేత మేస్తున్న క్రమంలో నాటుబాంబును కొరకడంతో పెద్ద శబ్దంతో పేలింది. గేదె దవడ భాగానికి తీవ్రగాయాలైనాయి. పెద్ద శబ్దం రావడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. కాగా మరిమడ్ల ప్రాంతంలో కొన్ని రోజులుగా నాటుబాంబులతో వన్యప్రాణుల వేట జరుగుతుందని, వాటికోసమే పెట్టిన బాంబు వల్ల గేదెకు గాయాలయ్యాయని గ్రామస్తులు పేర్కొన్నారు. గాయపడిన గేదె పరిస్థితి విషమంగా ఉందని బాధిత రైతు పేర్కొన్నాడు.

ఇంటి ముందు నిలిపిన బైక్ చోరీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలో ఇంటి ముందు నిలిపిన బైక్ చోరీకి గురైంది. మండల కేంద్రానికి చెందిన బొమ్మకంటి శ్రీను తన ద్విచక్ర వాహనాన్ని సోమవారం రాత్రి ఇంటివద్ద ఉంచాడు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి కనిపించ లేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా బైక్ ఆచూకీ లభించలేదు. ఇటీవల మండల కేంద్రంలో తరచూ ద్విచక్రవాహనాలు, బైక్‌లకు పెట్టిన హెల్మెట్లు మాయమవుతున్నాయి. పోలీసులు రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

సభ్యత్వాలు తీసుకోవాలి

సిరిసిల్లటౌన్: పద్మశాలీ యూత్‌వింగ్‌లో నూతన సభ్యత్వాలను ఆహ్వానిస్తున్నట్లు అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్ తెలిపారు. సిరిసిల్ల పద్మశాలీ సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వరకు పద్మశాలీ సోదరులు సభ్యత్వాలు తీసుకోవాలన్నారు.

పాఠశాల సందర్శన

గంభీరావుపేట(సిరిసిల్ల): పదో తరగతి ఇంటర్నల్ మార్కులపై విద్యాశాఖ మానిటరింగ్ అధికారుల బృందం ఆరాతీస్తోంది. దమ్మన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాలను అధికారులు సందర్శించి రికార్డులు పరిశీలించారు. టీం లీడర్ గంగారాం, శ్వేత, శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా శేఖర్

సిరిసిల్లటౌన్: యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా సిరిసిల్లకు చెందిన కాదాసు శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్ ఉత్తర్వులను అందించారు.